# ఓటరు జాబితాపై కలెక్టర్ సమావేశం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 18 : గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాలో చేయాల్సిన మార్పులు, చేర్పులను ఈ నెల 21వ తేదీలోపు అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విజయేందిరబోయి కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై బుధవారం జిల్లా ప్రభుత్వ అధికారుల సమీకృత భవన సముదాయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, జాబితాలో చనిపోయిన వారి పేర్లను శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జెడ్పీసీఈవో వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

**అక్టోబరు 1న వయోవృద్ధుల దినోత్సవం**

అతక్టోబర్ 1న వయో వృద్దుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.సమావేశంలో ఎస్పీ జానకి, డీఆర్‌డీఏ పీడీ నరసింహులు, ఆర్డీ వో నవీన్, డీఎంహెచ్‌వో డా. పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన దృశ్యం

హన్వాడ, సెప్టెంబర్ 18 : రుణమాఫీ కాని రైతులందరూ రేపు ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దెల్లి జంబులయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి కాలే యాదయ్యను హన్వాడ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వందశాతం రుణమాఫీ చేస్తామని సగం మందికి కూడా మాఫీ చేయకుండా రైతులను మోసం చేశాడన్నారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు నేడు ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వగా అక్కడికి వెళ్లకుండా ముందస్తుఅరెస్టు చేయడం దారుణం అన్నారు. కాంగ్రెస్ హయాంలో కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా ప్రజాస్వామ్య హక్కులను పూర్తిగా అణచివేస్తున్నదని ఆరోపించారు. ఆరుగ్యారెంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని పేర్కొన్నారు.

# చోరీ కేసులో నిందితుల అరెస్టు

**• 12 తులాల బంగారం స్వాధీనం • టుటౌన్ సీఐ ఎజాజ్ అహ్మద్**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 : పాత సామాన్లు ఏరుకునే ఇద్దరు నిందితులు తాళం వేసిన ఇండ్లను గుర్తించి రాత్రి వేళలో ఓ ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లి విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు గుర్తించి వారిని పట్టుకొని బంగారం స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మమబూబ్‌నగర్ టుటౌన్ సీఐ ఎజాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బోయపల్లి మున్సిపాల్టీ పరిధిలో నివాసం ఉంటున్న మండ్ల మాసయ్య అలియాస్ మొండి చిన్న, అదే ప్రాంతానికి చెందిన మండ్ల లక్ష్మి ఇద్దరు కలిసి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పాత ఇనుప సామాన్లు ఏరి అమ్ముకొని జీవిస్తూ ఉండేవారు. వీరు అప్పుడప్పుడు చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతుండేవారు. అయితే ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రంలోని పాతమోతినగర్ ప్రాంతంలో పాత సామాను కోసం తిరుగుతుండగా అక్కడ ఒక తాళం వేసి ఉన్న ఇల్లును గుర్తించారు. ఎవరూ లేని సమయంలో ఆ ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి వెళ్లి బంగారు ఆభరణాలు ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. ఈ క్రమంలో బాధితులు పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేయగా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బంగారు నగలను బుధవారం విక్రయించేందుకు పాన్ చౌరస్తాలో అనుమానాస్పందంగా తిరుగుతుండగా పై ఇద్దరిని పట్టుకొని విచారించగా వారి వద్ద 12.3 తులాల బంగారం ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరిని వెంటనే రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన టూటౌన్ ఎస్సైలు విజయ్ భాస్కర్, ఓబుల్ రెడ్డి, ఐడీ పార్టీ హెచ్‌సీ శేఖర్, హెచ్‌సీ రఘునాథ్‌రెడ్డి, పీసీలు మురళి, వెంకట్రాములు, బాబ్యానాయక్‌ను ఎస్పీ జానకి ప్రత్యేకంగా అభినందించారు.

## తాళం ఉన్న ఇంట్లో చోరీ

జడ్చర్ల, సెప్టెంబర్ 18 : జడ్చర్ల మున్సిపాలిటీలోని క్లబ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటే టశ్వర ఎంప్లాయిస్ కాలనీలోకి చెందిన సుంకసారి శ్రీహరి అనే ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఈ నెల 17వ తేదీన ఉదయం శ్రీహరి డ్యూటికి వెళ్లి తిరిగి రాత్రి 11గంటల సమయంలో ఇంటి వచ్చాడని, ఆ తర్వాత కొద్దిసమయానికి అతను పనిమీద జడ్చర్లలోని తన పాత ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. తిరిగి శ్రీహరి 18వ తేదీన ఉదయం 6గంటలకు గంటల సమయంలో లక్ష్మి వెంకటేశ్వర ఎంప్లాయీస్ కాలనీలోని ఇంటికి రాగా అప్పటికే ఇంటి తాళాలు విరగగొట్టబడి, ఇంటి తులుపులు తెరుచుకుని ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని బీరువాను తెరిచి అందులో ఉన్న వస్తువలను చిందరవందరగ పడవేసి ఉండటంతో అందులో ఉన్న 4తులాల బంగారు లాంగ్‌చైన్, ఒక జత తులం కమ్మలు, రెండు చిన్నపిల్లల బంగారు గొలుసులు రెండు తులాలు, 3తులాల రెండు బంగారు గొలుసు, తులం ఉంగరం, కొంత డబ్బు కన్పించలేదని తెలిపినట్లు సీఐ తెలిపారు. మొత్తం 11తులాల బంగారు వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తికెళ్లిరని బుధవారం జడ్చర్ల పోలీసులను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జడ్చర్ల, సెప్టెంబర్ 18 : 44వ జాతీయ రహదారిపై బూరెడ్డిపల్లి గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో జ్యోతమ్మ(47)అనే మహిళ మృందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల గ్రామానికి చెందిన జ్యోతమ్మ మంగళవారం రాత్రి రోడ్డుపక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని దాంతో ఆమెకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. పంచనామ నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి అల్లుడు పరమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## పేటలో ఉద్రిక్తత

**రెండు వర్గాల మధ్య ఘర్షణ పోలీసుల లాఠీచార్జీ**

నారాయణపేట, సెప్టెంబర్ 18 : పేట జిల్లా కేంద్రంలోని వీరసావర్కర్ చౌరస్తాలో ఓ వర్గం వారి పండుగను పురస్కరించుకొని జెండా ఏర్పాటు విషయంలో మరో వర్గానికి చెందిన యువకులు అడ్డు చెప్పారు. దీంతో మొదటి వర్గం వారి జెండాను తీయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. రెండు వర్గాల వారు రాళ్లు రువ్వుకోవడంతో ఇరు వర్గాల వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జీ చేశారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. అదనపు పోలీసు బలగాలను సైతం రప్పిస్తున్నారు.

## సూపర్ మార్కెట్‌లో దొంగతనం

నారాయణపేట, సెప్టెంబర్ 18 : పట్టణంలోని పాతగంజ్‌లో ఉన్న అంబికా సూపర్ మార్కెట్‌లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. షాపు యజమాని రమేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాతగంజ్‌లో ఉన్న అంబికా సూపర్‌మార్కెట్ నిర్వాహకులు సామాను కొనుగోలుచేసే నిమిత్తం రూ.1.80లక్షలు దుకాణంలోనే ఉంచి సోమవారంరాత్రి షాపు మూసివేశారు. అయితే మంగళవారం పట్టణంలో వినాయకనిమజ్జనం ఉండడంతో సూపర్‌మార్కెట్ తెరవలేదు. బుధవారం ఉదయం సూపర్‌మార్కెట్ తెరిచేందుకు వచ్చి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీం బృందం దొంగతనం జరిగిన ప్రాంతం వద్దకు చేరుకొని నమూనాలు సేకరించారు. దొంగ సూపర్‌మార్కెట్ పైకి వెళ్లిపై కప్పును తొలగించి లోపలికి వెళ్లి దొంగతనం చేశాడు. అంతేకాకుండా దొంగ ఎంతో తెలివిగా సీసీ కెమెరాల వైర్లు తొలగించడంతోపాటు సీసీ కెమెరాల దృశ్యాలు రికార్డుయ్యే డీవీఆర్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. దుకాణంలోని లాకర్‌ను కూడా తెరిచేందుకు దొంగ ప్రయత్నించి విఫలమయినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

## నిమజ్జన సమయంలో అపశృతి

**• నదిలో కాలు ఇరుక్కుపోయి యువకుడు మృతి**

మాగనూరు, సెప్టెంబర్ 18 : నిమజ్జన సమయంలో నదిలో కాలు ఇరుక్కుపోయి యువకుడి మృతి చెందిన ఘటన మండలంలోని ముడుమాల్ గ్రామంలో బుధవాం చోటుచేసుకున్నది. గ్రామస్తుల వివరాల మేరకు కొల్పూర్ గ్రామానికి పుట్టి తాయప్ప(33) గ్రామం నుంచి ముడుమాల్‌లో కృష్ణానదిలో వినాయకుడి నిమజ్జనం కోసం వెళ్లిన ప్రమాదవశాత్తు నీటిలో ఇరుక్కుపోయి కొట్టుమిట్టాడుతూ మునిగిపోతున్న తాయప్పను చూసి నిమజ్జనానికి వచ్చిన తోటి మిత్రులు ఒడ్డుకు చర్చిలోపే మృతి చెందాడని తెలిపారు. మృతిచెందిన తాయప్ప కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగించేవాడని ఆయనకు కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు.

## ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

జడ్చర్ల, సెప్టెంబర్ 18 : గంగాపూర్‌కు చెందిన సునీత(51) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మృతురాలు సునీత, తన మనవడితో కలిసి గంగాపూర్‌గ్రామంలో నివసిస్తుందని, బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సునీత గతకొంతకాలంగా అనారోగ్యర్త బాధపడుతుండేదని జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకున్నదని కూతురు కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



చీపురుకట్టలు, వైఫర్స్, వీల్ చైర్, చెత్తకుండీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

జడ్చర్ల, సెప్టెంబర్ 18 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఏరియా దవాఖానలో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం దవాఖాన కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్‌కేర్ సూపర్‌వైజర్ కార్మికులు చీపురుకట్టలు, వైఫర్స్, వీల్‌చైర్, చెత్తకుండీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు సురేశ్ మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ పరిధిలోని దవాఖానల సిబ్బందికి వేతనాల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. దాదాపు ఏడు నెలలుగా బడ్జెట్ ఇవ్వలేదని, కనీసం ఏజెన్సీల కాంట్రాక్టర్లతోనైనా జీతాలు చెల్లించేలా చర్యలు కూడా తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఈ నెల 19వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా దవాఖాన కార్మికుల పనిబంద్ సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, నవీన్, విజయలక్ష్మి, మణెమ్మ, అలివేల, పద్మ, సుక్కమ్మ పాల్గొన్నారు.




















